సాక్షి చిత్తూరు

శుక్రవారం । 12 । జనవరి । 2024



ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

జిల్లావ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. - 8లో



బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. - 8లో



చిరు వ్యాపారులకు జగనన్న తోడు

చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా అందిస్తున్న జగనన్నతోడు ఎంతో ఉపయోగపడుతోందని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రషీద



మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రషీద

పుంగనూరు: చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పుంగనూరు పట్టణానికి చెందిన రషీద నియమితులయ్యారు. గురువారం ఆమెకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పరిపాలనపై అవగాహన కల్పించి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



అరగొండలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తవణంపల్లె: మండలంలోని ఎరువులు, మందుల దుకాణాలను గురువారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం, భూసంరక్షణ విభాగం వ్యవసాయాధికారులు లక్ష్మీప్రసన్న, భారతి, తవణంపల్లె ఏఓ ప్రవీణ్‌కుమార్ తవణంపల్లె, అరగొండలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, మందులు విక్రయించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. అలాగే తవణంపల్లె ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలించారు.

జాబ్‌మేళాలో ఐదుగురికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్‌మస్ సర్వీసెస్ వారు సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో ఐదుగురికి ఉద్యోగం లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేలు జీతం, ఉచిత వసతి సౌకర్యం, అలవెన్సు ఉంటాయన్నారు. ప్రతిభ ఆధారంగా జీతంలో పెంపుదల ఉంటుందన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డా.పంకజ మాట్లాడుతూ గతంలో ఎంపికైన విద్యార్థులు అతితక్కువ కాలంలోనే చాలా పురోగతి సాధించారని తెలియజేశారు. కార్యక్రమంలో కంపెనీ విభాగం హెడ్ ధనరాజ్, జేకేసీ ఫుల్‌టైం మెంటార్ లాల్‌భాషా, అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథి పాల్గొన్నారు.

వినాయకునికి రూ.11 లక్షల విరాళం



విరాళం చెక్కులను ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన మురళీకృష్ణ రూ.11 లక్షలు విరాళంగా అందించారు. గురువారం సాయంత్రం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. అనంతరం ఆయన ఆలయ అధికారులకు స్వామివారి నిత్యాన్నదానానికి రూ.5 లక్షలు, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.5 లక్షలు, ఉదయాస్తమాన సేవకు రూ.లక్ష విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఇది కదా.. అభివృద్ధి

నాడు నరకం.. నేడు సౌఖ్యం



నాడు వెదురుకుప్పం మండలంలోని బ్రాహ్మణపల్లె- చంద్రగిరి రోడ్డు



నేడు బ్రాహ్మణపల్లె - చంద్రగిరి రోడ్డు

గతంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లపై ప్రయాణం చేయాలంటే సంకటంగా ఉండేది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి గెలిచి, 14 ఏళ్లు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న చంద్రబాబు నాయుడు కనీసం రోడ్లను కూడా అభివృద్ధి చేయలేకపోయారు. కానీ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత రోడ్లకు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారు. ఎన్నో ఏళ్లుగా మట్టి, గుంతలు పడిన రోడ్లపై నరక ప్రయాణం చేసిన జనం నేడు భద్రంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

- జిల్లాలో 75 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మట్టి రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం
- జిల్లావ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.83.40 కోట్లు వెచ్చింపు
- నాడు సంకటం.. నేడు సుఖమయమైన ప్రయాణం
- రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ

కార్వేటినగరం: గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది పాలకులు వచ్చినా గ్రామీణ రోడ్ల స్థితిగతులు మాత్రం మారలేదు. కొన్ని గ్రామాల్లో రోడ్ల రూపురేఖలే మారిపోయాయి. అయితే నాలుగున్నరేళ్ల కిందట అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంది. రోడ్ల కనెక్టివిటీ పెంచింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 75 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక, నిన్నమొన్నటి వరకు అస్తవ్యస్తంగా ఉన్న మట్టి రోడ్లపై ప్రజలు నరక ప్రయాణం చేశారు. ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లావ్యాప్తంగా రోడ్లు రూపురేఖలు మారిపోయాయి. నేడు పల్లె జనం సౌఖ్యంగా ఇంటికి చేరుకుంటున్నారు.



నాడు గుంతలమయంగా ఉన్న ఉగ్రాణంపల్లి రోడ్డు



నేడు ఆధునీకరించిన ఉగ్రాణంపల్లి రోడ్డు

డిప్యూటీ సీఎం చొరవతో..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ప్రత్యేక చొరవతో ఆరు మండలాల్లోని రోడ్లకు మోక్షం లభించింది. గతంలో వర్షం వస్తే ఆ రోడ్లపై అడుగు తీసి అడుగుపెట్టలేని పరిస్థితి. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా తారు రోడ్లు, సిమెంటు రోడ్లు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న గ్రామాలకు సైతం తారురోడ్లు వేయడంతో వ్యాపార, వాణిజ్యపరంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు చాలావరకు సమస్యలు తీరాయి. ఆరు మండలాల్లో ప్రభుత్వం ఈఏపీ(ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు) కింద మొత్తం 121.80 కిమీటర్లు రూ.79.99 కోట్లతో 62 పనులు చేపట్టింది. అదేవిధంగా గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, పెనుమూరు, వెదురుకుప్పం మండలాల్లో 49 కిలో మీటర్ల మేర రూ.24 కోట్లతో 7 రోడ్లను పీఎంజీఎస్వై కింద తారు రోడ్లుగా మారాయి.

రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు..

ఇప్పటి వరకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.83.40 కోట్లతో 179 పనులు చేపట్టి 470 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. రూ.29 కోట్లతో 53 పనులు 138 కి.మీ. పూర్తి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నరకయాతనకు చెక్..



మా గ్రామం అటవీ ప్రాంతంలో ఉంది. తిరుపతి-చిత్తూరు, పుత్తూరు వంటి ప్రాంతాలకు అత్యవసరంగా వెళ్లాలంటే రోడ్డు సక్రమంగా లేక నానా అవస్థలు పడేవాళ్లం. జగనన్న పాలన వచ్చాక తారు రోడ్డు వేయడంతో రాకపోకలకు ఇబ్బంది లేదు. అటవీ ప్రాంతాల్లోని గ్రామాలకు సైతం తారురోడ్లు వేసిన సీఎం జగనన్నకు మేము ఎప్పుడూ రుణపడి ఉంటాం. - శ్రీదేవి, గృహిణి, దిగువ పల్లాలు, వెదురుకుప్పం

బస్సు ఏర్పాటు చేశారు..



75 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు సరిగా లేదు. రాళ్లు తేలిన రోడ్లపై నడిచి ఒళ్లు గుల్లయింది. ఓట్ల కోసం వచ్చే నాయకులకు రోడ్డు బాగు చేయమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అటవీశాఖ పరిధిలోని రోడ్డును డీఫారెస్టు చేసి రోడ్డు వేశారు. ఇప్పుడు గ్రామంలో పండే పంటలను పట్టణానికి తరలించడానికి సౌలభ్యంగా ఉంది. బస్సు ఏర్పాటు చేయడం సంతోషం.

– సరస్వతి, నరసింహాపురం, పాలసముద్రం

టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు..



అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు వెళ్లే రోడ్ల గురించి టీడీపీ ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. ఎన్నిసార్లు చెప్పినా అతీగతి లేదు. ఈ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లను ఆధునీకరిస్తూ, అటవీ భూములను డీఫారెస్టు చేసి రోడ్డు నిర్మాణం చేయించారు. ప్రజల సౌకర్యార్థం పట్టణాలకు కనెక్టివిటీ పెంచుతూ బస్సు సౌకర్యం కల్పించారు. ఇలాంటి ప్రభుత్వం ఎప్పుడూ అధికారంలో ఉండాలి.

– వెంకటరత్నం, డీఎం పురం, కార్వేటినగరం

గతంలో మట్టి పోయలేదు..



గతంలో 1.70 కిలోమీటర్ల ఉన్న మా గుంటిపల్లి-చిత్తూరు రోడ్డు ఏ నాయకుడు గురించి పట్టించుకోలేదు. కనీసం వర్షాకాలంలో మట్టి పోసిన పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో రూ.1.8 కోట్లతో సీసీ రోడ్డు వేశారు. మంచి పనులు చేసే ఇలాంటి ప్రభుత్వం ఎప్పుడూ ఉండాలి.

– ఉమాపతి, గుంటిపల్లి, పెనుమూరు మండలం

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..



తేలికపాటి వర్షం వచ్చినా, కృష్ణాపురం జలాశయం గేట్లు ఎత్తినా, కుశస్థలి నది దాటేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. మూడు మండలాల ప్రజలు కుశస్థలీనది మీదుగా రాకపోకలు సాగించేవాళ్లం. గత ప్రభుత్వం కల్వర్టు నిర్మాణానికి హామీలతోనే గడిపేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక మంత్రి నారాయణస్వామి చొరవతో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.27 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో శరవేగంగా పనులు చేపడుతున్నారు. - చిట్టి, సర్పంచ్, ఉడమలకృత్తి

సమన్వయం..సర్వత్రా హర్షం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి పార్లమెంట్‌తో పాటు, సత్యవేడు, గూడూరు, చిత్తూరు, పూతలపట్టు అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం సమన్వయకర్తలను నియమించింది. తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ సమన్వయకర్తగా నియమించింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తిరుపతి పార్లమెంట్‌కి సమన్వయకర్తగా అధిష్టానం కేటాయించింది. ఎమ్మెల్సీ మేరిగ మురళిని గూడూరు అసెంబ్లీకి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని చిత్తూరు అసెంబ్లీకి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరేవుల సునీల్‌కుమార్‌ని పూతలపట్టు అసెంబ్లీకి సమన్వయకర్తలుగా నియమించినట్లు ప్రకటించింది. వీరి నియామకంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త - కోనేటి ఆదిమూలం



జననం: 7, ఏప్రిల్, 1952
తల్లిదండ్రులు : కాంతమ్మ, కోనేటి ఏలుమలై
స్వగ్రామం:భీమునిచెరువు,నారాయణవనం మండలం
కుమారుడు: కోనేటి సుమన్‌కుమార్
కుమార్తెలు: స్వప్న, శ్రావణి, శోభ
చదువు: బీఏ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి
రాజకీయ అరంగేట్రం:1976 కాంగ్రెస్ పార్టీలో చేరిక

- 1975 అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, పుత్తూరు
- 1979 పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్
- 1981 సర్పంచ్, భీమునిచెరువు
- 1987 మండల పరిషత్ వైస్ ఎంపీపీ
- 1989 కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి
- 1992: జిల్లా ఖాదీ బోర్డు డైరెక్టర్
- 1994 ఎంపీటీసీ సభ్యుడు భీమునిచెరువు
- 2001 జెడ్పీటీసీ సభ్యుడు, నారాయణవనం
- 2014: సత్యవేడు ఎమ్మెల్యేగా ఓటమి
- 2019: సత్యవేడు ఎమ్మెల్యేగా 44,786 ఓట్ల మెజార్టీతో గెలుపు

పూతలపట్టు సమన్వయకర్త ముత్తిరేవుల సునీల్‌కుమార్



- పుట్టిన తేదీ : 01-09-1969
- స్వగ్రామం: పైపల్లె, ఐరాల మండలం
- ఎడ్యుకేషన్ : ఎంబీబీఎస్, డీఎల్‌ఓ
- వృత్తి : డాక్టర్
- పొలిటికల్‌గా: మాజీ ఎమ్మెల్యే (2014-2019 వైఎస్సార్‌సీపీ)
- తండ్రి : రఘునాథయ్య
- భార్య : మమతారాణి
- పిల్లలు: కూతురు, కుమారుడు

సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త : మద్దిల గురుమూర్తి



ఊరు: మన్నసముద్రం, శ్రీకాళహస్తి నియోజకవర్గం
తల్లిదండ్రులు: రమణమ్మ, మునిక్రిష్ణయ్య
కుటుంబం: భార్య, కొడుకు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు
విద్యాభ్యాసం: మన్నసముద్రంలో ఐదు వరకు, 6 నుంచి 10 వరకు బందారుపల్లి, ఇంటర్ తిరుపతి, స్విమ్స్‌లో ఫిజియోథెరపీ

ఎంపీగా తీసుకొచ్చిన ప్రాజెక్టులు

- ఇంటర్నేషనల్ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి రూ.400 కోట్లు
- ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్ నిర్మాణానికి రూ.400 కోట్లు
- నైలెట్ కేంద్రానికి రూ.8.50 కోట్లు
- అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు (టెండర్ దశ వరకు తీసుకొచ్చారు)
- వెంకటగిరి టౌన్‌లో లైటింగ్ కోసం రూ.కోటి, వెంకటగిరి- ఏర్పేడుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు (టెండర్ దశకు తీసుకొచ్చారు)
- శ్రీపద్మావతి యూనివర్సిటీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు
- సత్యవేడు నియోజకవర్గం చిన్నపాండూరు రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు
- తిరుపతి బస్టాండ్ ఎదురుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.80 లక్షలు
- హీరో హోండా షోరూం, సీఆర్‌ఎస్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు

చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త : ఎంసీ విజయానందరెడ్డి



పుట్టిన తేది: 24-07-1969
తల్లిదండ్రులు: పద్మజ్యోతి, చిన్నబ్బరెడ్డి
భార్యపేరు : ఇందుమతి
కుమారుడు : నిఖిలానందరెడ్డి
పుట్టిన గ్రామం:ఎస్‌ఆర్‌పురం మండలం, కొటార్లపల్లి
ప్రస్తుతం ఉన్న ప్రాంతం -చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లి
చేపట్టిన పదవులు:2011 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు

- తర్వాత పార్టీ రాష్ట్ర, జిల్లాస్థాయి బాధ్యతల నిర్వహణ
- ప్రస్తుతం ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు

సేవా కార్యక్రమాలు

- మార్కెట్ గేట్‌కు ఏటా రూ.కోటి వరకు కేటాయింపు
- ఆస్పత్రిలో పార్కింగ్‌కు ప్రతి ఏటా రూ.5 లక్షల మేర చెల్లింపు
- ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫా, వివిధ వర్గాలు, ఉద్యోగులకు కానుకలు
- నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి
- కొటార్లపల్లెలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు
- విపత్తుల సమయంలో బాధితులకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు
- ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థికసాయం
- తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో సొంత నిధులతో వాటర్‌ప్లాంట్ నిర్మాణం
- చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్



విద్యార్హతలు: ఎంఏ హిస్టరీ
తండ్రి: ఎం.ఆనందరావు
తల్లి: సుందరమ్మ
భార్య: జ్యోతి
కుమారులు: డాక్టర్ రేవంత్, హేమంత్ కళ్యాణ్
చేపట్టిన పదవులు :

- రాపూరు డిగ్రీ కళాశాలలో 1988లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో చైర్మన్‌గా గెలుపు
- 1995లో రాపూరు జెడ్పీటీసీ
- 2013-15 వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు
- 2016-19 గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త
- తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా నియామకం
- 2022లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్
- 2023లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవం
- 2023 అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం విప్‌గా..

చిత్తూరుకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్

- జాతీయ స్థాయిలో 143, రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకులు



కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో చిత్తూరు నగరపాలక సంస్థ జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 ఫలితాలను కేంద్రప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ ఫలితాల్లో జాతీయస్థాయిలో చిత్తూరు నగరపాలక సంస్థ 143 ర్యాంకు సాధించినట్లు నగర కమిషనర్ అరుణ వెల్లడించారు. 1-10 లక్షల జనాభా కేటగిరీలో జాతీయ స్థాయిలో 446 నగరాలతో పోటీపడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ 143వ సాధించిందన్నారు. రాష్ట్రస్థాయిలో 31 నగరాలతో పోటీపడుతూ 9వ స్థానంలో నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతేడాది ర్యాంకు 153 కంటే 10 ర్యాంకులు మెరుగుపరచుకున్నట్లు తెలిపారు. గతేడాది 382 నగరాలు పోటీ పడగా, ఈ ఏడాది 446 నగరాలు పోటీపడ్డాయని చెప్పారు. మనకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలతో పోటీపడుతూ, పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వహణ, ఓడీఎఫ్ ప్లస్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరీలో గతంలో కంటే మెరుగైన మార్కులు సాధించినట్లు తెలిపారు. 2022లో 3,433.86 మార్కులు సాధించగా, 2023లో 5,174.45 మార్కులు సాధించిందని, అమృత్ 2.0లో భాగంగా సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు మంజూరైనట్లు చెప్పారు. ఇవి పూర్తై అందుబాటులోకి వేస్తే మరింత మెరుగైన ర్యాంకు సాధించవచ్చన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో మెరుగైన ఫలితాలు సాధించడంపై కమిషనర్ అరుణ నగర ప్రజలకు అభినందనలు తెలిపారు.

వలంటీర్ సేవలకు సెల్యూట్

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- సంక్రాంతి కానుకగా వలంటీర్లకు దుస్తులు



వలంటీర్లకు కానుకలు అందజేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజలకు అందించడంలో కీలకంగా పనిచేస్తున్న వలంటీర్లకు సెల్యూట్ అని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని 1400 మంది వలంటీర్లకు సంక్రాంతి కానుకను పంపిణీ చేశారు. మహిళా వలంటీర్లకు రెండు జతల చీరలు, పురుషులకు రెండు జతల దుస్తులు, రూ.1000 చొప్పున కుట్టుకూలి చేతికిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేయడం గొప్ప విషయమన్నారు. వీరి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వలంటీర్లను సన్మానిస్తోందన్నారు. అయితే 58 నెలలు కనిపించని నాయకులంతా ఎన్నికలు వస్తే మాత్రం ఊర్లలోకి వచ్చి దిగుతారని, మళ్లీ రెండు నెలల్లో ఎన్నికలు ముగిస్తే అన్నీ సర్దుకుని వెళ్లిపోతుంటారని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వారే నిజమైన నాయకులని, వారినే క్షేత్రస్థాయిలో బలపరుద్దామన్నారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు మనమంతా జగనన్న సైనికుల్లా పనిచేద్దామన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి ఈ చిరు కానుకను అందిస్తున్నానని, పెద్ద పండుగను ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు కేపీ శ్రీధర్, అమరనాథ్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, మధుసూదన్ రాయల్, త్యాగరాజులు, హరిప్రసాద్, తుమ్మింద కుమార్, ప్రతిమారెడ్డి, మధు, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో చంద్రగిరిలో జనవరి 17వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19–45 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ స్త్రీ,పురుషులు శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థ వద్దకు వచ్చి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి, 79896 80587, 94949 51289 63017 17672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సినీ డైరెక్టర్ ఆకుల శివకు మాతృవియోగం



మునిలక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డైరెక్టర్ శివ, స్థానిక నాయకులు

కార్వేటినగరం: ప్రముఖ సినీ డైరెక్టర్ ఆకుల శివ మాతృమూర్తి మునిలక్ష్మమ్మ(92) గురువారం మృతి చెందారు. సమాచారం అందుకున్న పలువురు ప్రముఖులు గ్రామానికి వెళ్లి మునిలక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలజీ , పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, గోపిరాయల్, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, టీకేఎంపేట సర్పంచ్ గోవిందమ్మ, ఎంపీటీసీ ధన్‌రాజ్ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం సీజ్ చేసి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ భారతి తెలిపారు. చిత్తూరు పీవీకేఎన్ కళాశాల ఆవరణలో గురువారం గంగసాగరం గ్రామానికి చెందిన సత్తి వద్ద నుంచి కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- కలెక్టరేట్‌లో ఘనంగా జగనన్న తోడు 8వ విడత పథకం
- జిల్లాలో 15,085 మందికి రూ.15.96 కోట్ల లబ్ధి
- హాజరైన ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్



జగనన్న తోడు 8వ విడత మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : చిరువ్యాపారులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటోందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. జగనన్న తోడు 8వ విడత పథకాన్ని తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ నిరుపేదలైన చిరువ్యాపారులు, హస్తకళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల కష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఏటా జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తోందన్నారు. టీడీపీ పాలనలో ఓట్ల కోసం మాత్రమే హామీలు ఇచ్చే వారని దుయ్యబట్టారు. జగనన్న తోడు పథకంలో ప్రతి ఏటా అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10,000 రుణం సున్నావడ్డీకి అందిస్తూ రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. రుణాలను సకాలంలో చెల్లించిన వారికి ఆ రూ.10,000కి అదనంగా ఏడాదికి మరో రూ.వెయ్యి చొప్పున జోడిస్తూ రూ.13000 వరకు వడ్డీ లేని రుణం అందిస్తున్నట్లు తెలిపారు.

మెగా చెక్ అందజేత..

కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం జగనన్న తోడు 8వ విడత పథకం ద్వారా జిల్లాలోని 15,085 మందికి రూ.15.96 కోట్ల లబ్ధిని చేకూరుస్తోందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో అర్బన్ పరిధిలో 4,347 మంది లబ్ధిదారులకు రూ.4.60 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని 10,738 మంది లబ్ధిదారులకు రూ.11.36 కోట్లు ప్రభుత్వం జమచేస్తోందని తెలిపారు. అనంతరం వారు జగనన్న తోడు 8వ విడత మెగాచెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి, డీఆర్‌డీఏ పీడీ తులసి, లబ్ధిదారులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెలుగులు నింపారు..



మాది నిరుపేద కుటుంబం. కూలీ పనులకు వెళ్తే కాని మా పొట్ట నిండని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న తోడు పథకం ద్వారా ఏటా లబ్ధి పొందుతున్నా. ఈ పథకంలో అందుతున్న ఆర్థిక సహాయం తో చిన్న టిఫిన్‌షాపు నడుపుకుంటున్నా. అలాగే మాకు ఉచితంగా ఇంటిపట్టాతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన రుణాన్ని ప్రభుత్వం ఇచ్చింది. నా భర్తకు పింఛన్, నా కొడుకు వాహనమిత్ర పథకం లబ్ధి పొందుతున్నాడు. మా కుటుంబాన్ని ఇంతలా ఆదుకుంటున్న సీఎం జగనన్నకు ఇంటిల్లిపాది రుణపడి ఉంటాం.

– కస్తూరి, ఓటి చెరువు, చిత్తూరు.

చీరల వ్యాపారం చేసుకుంటున్నాను....



మాది పేద కుటుంబం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం ద్వారా అందుతున్న నగదుతో చీరల వ్యాపారం చేసుకుంటూ నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటి పట్టా ఇచ్చారు. ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సహాయంతో ఇల్లు కట్టుకున్నాం. మా అత్తకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. మా కుటుంబానికి ఇంత మంచి చేస్తున్న సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరిచిపోం.

– జాస్మిన్, ప్రశాంత్‌నగర్, చిత్తూరు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

- ఆకట్టుకున్న సామాజిక సమతా సంకల్పం ఫొటో ఎగ్జిబిషన్
- ప్రారంభించిన ఎంపీ రెడ్డెప్ప, నగర మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంపీ , జేసీ, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్. అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ రెడ్డెప్ప, నగర మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా విజయవాడలో 125 అడుగుల డా.బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.450 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గతంలో జమిందార్లకు మాత్రమే సొంతమైన ఓటు హక్కును రాజ్యాంగం ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ అంబేడ్కర్ ఓటు హక్కు కల్పించారన్నారు. మానవాళికి, మానవీయతకు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. విదేశీ విద్యాదీవెన పథకంతో పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు సర్కారు ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గాన్ని నేటి విద్యార్థులు అనుసరించి సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా డా.బీఆర్ అంబేడ్కర్‌ను సర్మించుకునే కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డా.బీఆర్.అంబేడ్కర్ దేశంలో అట్టడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానుభావులన్నారు. రాష్ట్రప్రభుత్వం విజయవాడలో 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయిలో ఈ నెల 19 వరకు సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, సామాజిక సమతా సంకల్పం వాల్‌పోస్టర్‌పై వారు సంతకాలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, నగర కమిషనర్ అరుణ, డీవీఎంసీ సభ్యులు రాజ్ కుమా ర్, బాబు, దేవరాజులు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక స్టేట్ జనరల్ సెక్రటరీ మునిస్వామి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టమాట మండీ దగ్ధం



విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో కాలిపోతున్న రేకుల షెడ్

రొంపిచెర్ల: విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా టమాట మండీ దగ్ధమైన సంఘటన రొంపిచెర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. బండకిందపల్లెకు చెందిన అక్బర్‌అలీ మటోళ్లపల్లె వద్ద టమాట మండీ ఏర్పాటు చేసుకున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగింది. రోడ్డు పక్కన వెళ్తున్న వారు చూసి పీలేరులోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో 250 టమాట బాక్సులు, 5 టైర్లు, సీలింగ్ ఫ్యాన్లు, రేకులు కాలిపోయి సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు అక్బర్ అలీ వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



హనుమంతుడి పల్లకి మోస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నగరి పట్టణం, మండల పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు విచ్చేశారు. మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజ స్వామి ఆలయంలోని వీరాంజనేయ స్వామి ప్రాకారంలో నిర్వహించిన హనుమజ్జయంతి వేడుకల్లో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనల్లో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాకారంలో స్వామివారికి ప్రదక్షిణ చేయగా మంత్రి పరవశిస్తూ స్వామివారి పల్లకిని మోస్తూ వెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. వేదపండితులు ఆమెకు ప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈఓ, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్ మురుగ, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, ఆలయ పాలక మండల సభ్యులు, సత్రవాడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో స్వామివారిని అరటి పండ్లతో అలంకరించడం అందరినీ ఆకట్టుకుంది.

వెల్‌నెస్ సెంటర్‌లో తనిఖీలు



యాదమరి వైద్యులతో మాట్లాడుతున్న జాతీయ నాణ్యతా ప్రమాణాల బృంద సభ్యులు

యాదమరి: మండలంలోని జంగాలపల్లె సచివాలయ ఆవరణలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సభ్యులు తనిఖీ చేశారు. గురువారం ఉదయం జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం జంగాలపల్లెలోని హెల్త్ అండర్ వెల్‌నెస్ సెంటర్‌కు చేరుకున్నారు. హెల్త్ అండర్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు, అలాగే వైద్య పరికరాలను, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ ప్రజలకు కేంద్రప్రభుత్వం ఈ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అలాగే ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం వైద్యులు అర్జిత్ బెనర్జీ, కిరణ్, యాదమరి మండల వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని తెలిపారు. గురువారం స్థానిక డ్వామా కార్యాలయ సమావేశ భవనంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, ఏపీ స్టేట్ యూనిట్ ఆఫీస్ ఆధ్వర్యంలో భూగర్భ జలాల నిర్వహణ, అభివృద్ధిపై డ్వామా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ పరిధిలోని వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలతో పాటు చిత్తూరు జిల్లాలో కూడా తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. దీంతో జిల్లాను జలశక్తి అభియాన్ ప్రాజెక్టు పరిధిలోకి చేర్చినట్లు తెలిపారు. జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా నీటి నిల్వ పనులు విరివిగా చేపట్టామన్నారు. అదేగాకుండా ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపే లక్ష్యంగా పనులు వేగవంతం చేశామన్నారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటేనే భవిష్యత్తులో సాగు, తాగునీటి సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి, ఏపీ యూనిట్ ఆఫీస్ ఇన్‌చార్జ్ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓబులేసు, సైంటిస్ట్ మోనిక, డ్వామా టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్





సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రపంచ దేశాలు చిరుధాన్యాల పట్ల ఆసక్తి చూపుతున్నాయని, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దిగుబడి అయ్యే ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో రైతులకు నిల్వ ఆధారిత ఆహార ఉత్పత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో దిగుబడి అయిన ఉత్పత్తులను నిల్వ ఆధారిత ఉత్పత్తులుగా తయారు చేస్తే మార్కెట్‌లో డిమాండ్ పెరిగి మంచి లాభాలను ఆర్జించవచ్చన్నారు. అయితే ఈ తయారీ విధానంపై రైతులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ ఉత్పత్తి అయినా ఎక్కువ రోజులు నిల్వ ఉండి అందులో ఉన్న పోషకాలు సహజసిద్ధంగా ఉంటే అలాంటి ఆహార ఉత్పత్తులకు ప్రపంచ దేశాల్లో మంచి మార్కెట్ ఉంటుదన్నారు. మార్కెటింగ్ సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని ఉత్పత్తుల తయారీకి మక్కువ చూపాలన్నారు. జిల్లాలో బెల్లం, వేరుశనగ, చింతపండు, మామిడితో పాటు ఇతర బేకరీ ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు ప్రస్తుత పరిస్థితులు చాలా అనుగుణంగా ఉన్నాయన్నారు. దీనిపై మక్కువ ఉన్న రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించడం జరుగుతోందన్నారు. ఇందుకోసం యూనిట్ విలువలో 10 శాతం రైతు వాటా చెల్లిస్తే, 35 శాతం రాయితీతో 55 శాతం రుణాన్ని అందించడం జరుగుతుందన్నారు. సదస్సులో డీపీఎంలు, ఏపీఎంలు, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో

– ఇద్దరు వెల్డింగ్ కూలీలు మృతి, మరో వ్యక్తికి గాయాలు





ప్రమాదంలో మృతి చెందిన నారాయణ, రాజేష్

గంగవరం: అతివేగంగా వస్తున్న బొలెరో వాహనం రోడ్డు మలుపులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గంగవరం మండలంలో వెలుగు చూసింది. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. పలమనేరు పట్టణం మదనపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న లోకనాథచారి(49) పెద్దపంజాణి మండలం మాడీలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. పట్టణంలోని ఎంజీఆర్ నగర్‌కు చెందిన నారాయణ(54), మదనపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న రాజేష్(47) ఇద్దరు కూలీలను షాపులో వెల్డింగ్ పని గురించి మాట్లాడుకున్నాడు. ముగ్గురూ కలిసి బైక్‌లో మాడీకి బయలుదేరారు. దండపల్లి రోడ్డులో వెళ్తుండగా ఇండెన్ గ్యాస్ గోడౌన్ వద్ద అజాగ్రత్తగా వస్తున్న బొలెరో వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో నారాయణ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, రాజేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ లోకనాథాచారిని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్‌ను గంటావూరు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర పోలీసుల సమన్వయ సమావేశం



సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న పోలీసులు

పలమనేరు: ఏపీలో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పోలీసులు కర్ణాటక రాష్ట్రంలోని కోలారు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా సరిహద్దులైన కేజీఎఫ్, కృష్ణగిరి, కోలార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీ ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు, అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువుల తరలిపు, అంతర్రాష్ట్ర నేరస్తుల కదలికపై నిఘాపై చర్చించారు. జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశానికి పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో కేజీఎఫ్ ఎస్పీ శాంతరాజ్, కోలార్ డీసీ అక్రం బాషా, అడిషనల్ ఎస్పీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్-ఐచర్ వాహనం ఢీ



మృతి చెందిన రామయ్య

బంగారుపాళెం: మండలంలో సంక్రాంతిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు. వివరాలు.. బుధవారం రాత్రి మండలంలోని మహాసముద్రం గ్రామానికి చెందిన చిన్నయ్య, కరిపిరెడ్డిపల్లెకు చెందిన రామయ్య ట్రాక్టర్‌లో కేజీ సత్రానికి వెళ్తున్నారు. అదే సమయంలో చిత్తూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐచర్ వాహనం సంక్రాంతిపల్లె వద్ద వీరి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నయ్య, రామయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రామయ్య(65) చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలు ఆలోచించాలి

చిత్తూరు కార్పొరేషన్/తిరుపతి మంగళం: వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన మొదటి మూడు వారాల్లో అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతూ జీఓ–18 విడుదల చేశారని వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు నెలకు రూ.500 చొప్పున అదనంగా ఇస్తోందన్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.27.8 కోట్లు చెల్లిస్తోందని చెప్పారు. 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవని మన ప్రభుత్వం వచ్చాక వందలాది మందికి ప్రమోషన్లు ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చారని గుర్తు చేశారు. యూనిఫాం పంపిణీ, వార్షిక, ప్రసూతి సెలవులు, బీమా సౌకర్యం, పదవీ విరమణ సమయంలో ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కేంద్రాల్లో స్మార్ట్ టీవీల ఏర్పాటు, టేక్‌హోం రేషన్ పద్ధతిని ప్రవేశపెట్టారన్నారు. వీటి గురించి అంగన్‌వాడీలు ఆలోచించి సహకరించాలని పేర్కొన్నారు.